సాక్షి
జోగులాంబ గద్వాల

ఆదివారం ౹ 14 ౹ ఏప్రిల్ ౹ 2024

తనిఖీల్లో నగదు పట్టివేత

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శనివారం ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో నగదు, మద్యం పట్టుబడింది.



వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.4/26.2

ఉదయం ఉంచే ఎండ ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు బలంగా వీస్తాయి. ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం



అలంపూర్: ప్రజలు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జ్ అధికారి కురుమూర్తి అన్నారు. శనివారం అలంపూర్ చౌరస్తాలోని ఫైర్ స్టేషన్‌లో అగ్ని ప్రమాదాల నివారణ వారోత్సవాల పోస్టర్‌ను ఆయన సిబ్బందితో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా కురుమూర్తి మాట్లాడుతూ.. 1944 ఏప్రిల్ 14వ తేదీన విక్టోరియాలోని ఓడ రేవు వద్ద నౌకలోని పైభాగంలో పత్తి, కింది భాగంలో మందు గుండు సామగ్రితో సముద్రం గుండా ప్రయాణిస్తుండగా ఓ ప్రమాదం జరిగిందని, మంటలను అదుపు చేసేందుకు ఫైర్ సిబ్బంది వెళ్లగా మందుగుండు సామగ్రి ఒక్కసారిగా పేలిందన్నారు. ఈ ప్రమాదంలో 231 మంది ఫైర్ సిబ్బంది మృతి చెందగా మరో 476 మంది ఫైర్ సిబ్బంది క్షతగాత్రులయ్యారని, దీంతో నాటి నుంచి దేశ వ్యాప్తంగా ఫైర్ సిబ్బందితోపాటు సామాన్య ప్రజలకు అగ్ని ప్రమాదాల నివారణ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రదేశాలకు వెళ్లి ఫైర్ సిబ్బంది అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించనున్నారన్నారు. అలంపూర్ ప్రాంతంలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, రైతులు తమ పొలాల్లోని చెత్తను, ఇతర పంట ఉత్పత్తుల వ్యర్థాలను తొలగించే క్రమంలో నిప్పంటిస్తున్నారని, ఈ క్రమంలో అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నట్లు తెలిపారు. రైతులు అగ్ని ప్రమాదాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫైర్ మెన్ ఉదయ్ కుమార్, హోంగార్డులు రాజేశ్వర్ రెడ్డి,తులసిరాం, రాజు తదితరులు ఉన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలు తిప్పికొట్టాలి



గద్వాల అర్బన్: మతోన్మాద, ప్రజా వ్యతిరేక విధానాలు, నిరంకుశ పోకడలను బీజేపీ అనుసరిస్తుందని.. ప్రజలు ఓటు అనే ఆయుధంతో వాటిని తిప్పికొట్టాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు ఎంవీ రమణ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో వామపక్ష ఆధ్వర్యంలో జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీకి దేశభక్తి గురించి మాట్లాడే అర్హత లేదని, పదేళ్లలో అత్యంత పెట్టుబడిదారీ, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉంటూ కార్మిక వర్గాన్ని అధోగతి పాలు చేసిందన్నారు. సరిహద్దులో మద్దతు ధర కోసం పోరాడుతున్న రైతులపై కాల్పులు జరిగిన చరిత్ర ఆ పార్టీదేనని ఆరోపించారు. నిత్యావసర ధరలను విపరీతంగా పెంచారని, వైద్యంపై 5శాతం ఉన్న జీఎస్టీని 12శాతానికి పెంచడం శోచనీయమన్నారు. దేశంలో పేదరికం, మైనార్టీలు, దళితులపై దాడులు పెరిగాయని, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పారని, రాజ్యాంగబద్ధ సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించి రాజ్యాంగాన్ని, దేశాన్ని రక్షించుకోవడానికి ప్రజలు కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, సీపీఎం, సీపీఐ నాయకులు ఉప్పేరు నర్సింహ్మా, రాజు, ఖాసీం, ఆశన్న, రామకృష్ణ ఉన్నారు.

వచ్చే నెల 16 నుంచి ఎంబీ కన్వెన్షన్ మహాసభలు



అమరచింత: గద్వాల కేఎస్ ఈవెంట్ హాల్‌లో మే నెల 16 నుంచి 19వ తేదీ వరకు జరిగే ఎంబీ కన్వెన్షన్ మహసభలను ఘనంగా నిర్వహిద్దామని ఎంబీ కాన్ఫరెన్స్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు రెవరెండ్ డా. ఐపీ ఆశీర్వాదం అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంబీ కర్మెల్ చర్చిలో ఎంబీ కన్వెన్షన్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. దేవుడిపై భక్తి కలిగి పాపుల పట్ల ప్రేమ, కరుణ చూపుతూ దేవుడి సేవలో కొనసాగుతున్న ప్రతి ఒక్కరూ మహసభల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంబీ బోర్డు అధ్యక్షుడు జీకే రూపమ్, బోర్డు ప్రధానకార్యదర్శి శ్యాంరావు, రాజేందర్, పాస్టర్ హ్యపీపాల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విత్తన 'పత్తి'

అక్రమార్కులకు అండగా..!

- ప్రతిఏటా ఆలస్యంగా తనిఖీలు.. తూతూమంత్రపు దాడులు
- విఫల సీడ్‌ను బ్రోకెన్ చేయకుండా నిల్వ చేస్తున్న వైనం
- ఎజన్‌లో కంపెనీల స్టిక్కర్లు ముద్రించిన పాకెట్లలో నింపి అమ్మకాలు
- శ్రమ దోపిడీతోపాటు ఆర్థికంగా నష్టపోతున్న రైతులు

సీడ్ ఆర్గనైజర్ల దందాకు అధికార యంత్రాంగం పరోక్ష సహకారం



నారాయణపేట జిల్లా సింగారంలో పట్టుబడిన నకిలీ పత్తి విత్తనాలను పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: మార్కెట్‌లోకి వెల్లువెత్తుతున్న నకిలీ, నాసిరకం, నాణ్యత లేని విత్తనాలు రైతాంగం జీవితాలతో చెలగాటమాడుతున్నాయి. ప్రధానంగా విఫల విత్తనాలు రైతుల ఆరుగాలం శ్రమతోపాటు రూ.లక్షల్లో పెట్టుబడిని హరిస్తూ.. వారి జీవితాలను అంధకారంలోకి నెడుతున్నాయి. ఫెయిల్యూర్ విత్తనాల దందా ప్రతి సంవత్సరం నిత్యకృత్యంగా మారినా.. మాఫియాగా ఏర్పడిన సీడ్ ఆర్గనైజర్లే ఇందుకు కారణమని తెలిసినా.. 'అధికార' యంత్రాంగం తూతూమంత్రపు చర్యలతో సరిపెడుతుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల నారాయణపేట జిల్లాలో విఫల పత్తి విత్తనాలు పట్టుబడిన నేపథ్యంలో 'సాక్షి' ఫోకస్..

విత్తన శుద్ధి కేంద్రాల్లోనే ఏమార్చి..

విత్తన పత్తి సాగుకు సంబంధించి కంపెనీలు, రైతులకు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న సీడ్ ఆర్గనైజర్లే నకిలీ, నాసిరకం, విఫల విత్తన దందాలో కీలకపాత్ర పోషిస్తున్నారు. కంపెనీలు తాము తయారు చేసిన విత్తనాలను సీడ్ ఆర్గనైజర్లకు అందజేయగా.. వారు సాగు నిమిత్తం ఈ విత్తనాలను రైతులకు ఇస్తారు. రైతులు సాగు చేసిన విత్తనాలను ఆర్గనైజర్లు తిరిగి సేకరించి.. ఆయా కంపెనీలకు అందజేస్తారు. అలా వచ్చిన విత్తనాల నమూనాలు తీసుకుని కంపెనీలు మొలక పరీక్ష (జీఓటీ) నిర్వహిస్తాయి. మొలక శాతం తగినంత లేని వాటిని విఫల విత్తనాలుగా గుర్తించి ఆర్గనైజర్లకే అందజేస్తున్నాయి. ఇక్కడే ఆర్గనైజర్లు మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. విఫల విత్తనాలను ఆయా రైతులకు అందజేసి.. అక్కడే బ్రోకెన్ (పగులగొట్టి) చేయాలి. కానీ, రైతులకు ఇవ్వకుండా, పగులగొట్టకుండా వీటిని దొంగచాటుగా గద్వాల, భూత్పూర్‌తోపాటు హైదరాబాద్ శివార్లలో ఉన్న పలు విత్తన శుద్ధి కేంద్రాలకు తరలిస్తున్నారు. అక్కడ కంపెనీల స్టిక్కర్లు ముద్రించిన పాకెట్లలో నింపి మార్కెట్‌లోకి పంపుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఖరీఫ్‌లో సాధారణ పత్తి 5 లక్షల ఎకరాలు కాగా.. గద్వాల, మహబూబ్‌నగర్ జిల్లాల్లో విత్తన పత్తి సాగు సుమారు 50 వేల ఎకరాల్లో ఉన్నట్లు అంచనా.

విమర్శల వెల్లువ

పెట్టుబడి పెట్టకుండా విఫల పత్తి విత్తనాలతో యథేచ్ఛగా అక్రమ వ్యాపారం చేస్తూ.. తిరుగులేని మాఫియాగా అవతారమెత్తిన గద్వాల సీడ్ ఆర్గనైజర్లు, సబ్ ఆర్గనైజర్లపై ప్రభుత్వ యంత్రాంగం కఠిన చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందే తనిఖీలు చేపట్టాల్సిన అధికారులు మిన్నంకుండి.. విత్తే సమయం ముగిసిన తర్వాత సోదాలు చేపట్టడం పరోక్షంగా అక్రమార్కులకు సహకరిస్తున్నట్లేనని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2021లో అప్పటి ప్రభుత్వం నకిలీ విత్తనాలపై కన్నెర్రజేయగా.. మల్దకల్ మండలానికి చెందిన ఓ ఆర్గనైజర్‌పై పీడీ యాక్ట్ ప్రయోగించింది. ఆ తర్వాత ఎవరూ అంతగా పట్టించుకోకపోవడంతో నకిలీ విత్తన దందా షరా మామూలైంది. 2021 నుంచి ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలో సుమారు 500 క్వింటాళ్ల నకిలీ విత్తనాలు పట్టుబడినట్లు సమాచారం. తాజాగా నారాయణపేట జిల్లాలో ఈ నెల 10న సింగారం గ్రామంలో రూ.8.85 లక్షల విలువైన 8.85 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడడం ఆందోళన కలిగిస్తోంది.

టాస్క్‌ఫోర్స్ తనిఖీలు నామమాత్రమే..

జూన్‌లో వర్షాకాలం (ఖరీఫ్) సీజన్ ప్రారంభమవుతుంది. దీనికి రెండు నెలల ముందు నుంచే విత్తన విక్రయాలకు సంబంధించి కార్యకలాపాలు షురూ అవుతాయి. నకిలీ విత్తనాలను కట్టడి చేసేలా ఏప్రిల్ మొదటి వారం నుంచే నిఘా పెట్టాలి. ఈ మేరకు జిల్లాల వారీగా వ్యవసాయ, పోలీస్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టేలా టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేయాలి. ఈ కమిటీలు విత్తన శుద్ధి కేంద్రాల్లో సోదాలు చేపట్టి విత్తన నమూనాలను సేకరించి పరీక్షలకు పంపించాలి. మంచి విత్తనాలు అని తేలిన వాటినే పాకెట్ల రూపంలో మార్కెట్‌కు తరలించేందుకు అనుమతివ్వాలి. కానీ, ఈ ప్రక్రియ ప్రతిఏటా నామమాత్రంగానే సాగుతోంది. తూతూమంత్రపు దాడులతో సరిపెడుతుండడంతో విఫల విత్తనాలు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. అంతేకాకుండా టాస్క్‌ఫోర్స్ తనిఖీలు ఎప్పుడూ ఆలస్యంగానే (సీజన్ ముగుస్తుందనగా) ప్రారంభం కావడం పరిపాటిగా మారింది. ఉమ్మడి పాలమూరులోని ఐదు జిల్లాల్లో ఇప్పటివరకు టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు కాకపోవడమే ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు.

సాక్షి ఫోకస్

కలెక్టర్ దృష్టి సారించాలి..



ఫెయిలైన విత్తనాలను ఆర్గనైజర్లు, సబ్ ఆర్గనైజర్లు రీశాంపిల్‌కు ఎందుకు పంపడం లేదు..? ఫెయిలైన విత్తనాలను రైతులకు ఇవ్వకుండా బ్లాక్ మార్కెట్‌లో నకిలీ విత్తనాలు అమ్మడం వల్ల నష్టపోతున్నారు. ఆయా కంపెనీలు కూడా ప్రతి సంవత్సరం ఫెయిలైన విత్తనాల జాబితాను వ్యవసాయ శాఖకు ఎందుకు ఇవ్వడం లేదు..? దీనిపై వ్యవసాయ శాఖ అధికారులు, కలెక్టర్ దృష్టిపెట్టాలి. – ఆంజనేయులు, సీపీఐ జిల్లా కార్యదర్శి, గద్వాల

నాసిరకం విత్తనాలతో నష్టపోయా..



2021–22లో నా భూమి 20 ఎకరాలతోపాటు మరో 20 ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశా. మొత్తం 40 ఎకరాల్లో ఓ కంపెనీకి చెందిన పత్తి విత్తనాలు పెట్టా. ఎకరాకు రూ.60–70 వేల వరకు పెట్టుబడి అయింది. సాగు చేసిన విత్తనాలు నాసిరకంగా ఉండడంతో పంట దిగుబడి దారుణంగా తగ్గింది. ఎకరాకు 1–2 క్వింటాళ్లు కూడా దిగుబడి రాలే. ఈ మేరకు నష్టపరిహారం కోసం ప్రభుత్వాన్ని ఆశ్రయించినా లాభం లేకపోయింది. – పరమేష్, రైతు, మానవపాడు, గద్వాల

తాగునీటి సమస్యపై జలదీక్ష



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: నడిగడ్డలో తాగునీటి సమస్య పరిష్కారం కోరుతూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన గద్వాలలోని పాతబస్టాండ్‌లో జలదీక్ష చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తీవ్రవర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఇప్పటికే జిల్లాలోని చాలా గ్రామాల్లో తాగునీటి సమస్యలు మొదలయ్యాయని, ఇదే పరిస్థితి కొనసాగితే రాబోవు రోజుల్లో పరిస్థితి మరింత తీవ్రమవుతుందని దీనిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు. కర్ణాటకలోని నారాయణపూర్ నుంచి 5టీఎంసీల నీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని, కర్ణాటకలో కూడా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఉన్నందున సీఎం రేవంత్‌రెడ్డి ఆ దిశగా చర్యలు తీసుకుని ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఈనేపథ్యంలోనే ప్రభుత్వంలో చలనం తీసుకొచ్చేందుకు తాను ఈనెల 15వ తేదీ సోమవారం పట్టణంలోని పాతబస్టాండులో జలదీక్ష కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్‌రావు హాజరు కానున్నట్లు తెలిపారు. జలదీక్షకు ప్రజలు, రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్, నాగిరెడ్డి, సతీష్, సంగాల నర్సింహులు, రామయ్య, కురుమన్న పాల్గొన్నారు.

శనైశ్వరుడికి పూజలు



బిజినేపల్లి: మండలంలోని నంది వడ్డెమాన్‌లో జ్యేష్ఠాదేవి సమేత శనైశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి ఆధ్వర్యంలో భక్తులు శనైశ్వరుడికి తిలతైలాభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

చోరీలతో బెంబేలు

- జిల్లాలో మూడు నెలల్లో 102 సంఘటనలు
- పోలీసులకు సవాల్ విసురుతున్న దొంగలు
- రూ.1.64 కోట్ల విలువైన సొత్తు అపహరణ.. ఇప్పటి వరకు వసూలైంది రూ.36.58 లక్షలే...



పెబ్బేరు మున్సిపల్ కాంప్లెక్స్‌లో ఇటీవల చోరీ జరిగిన దుకాణం

వనపర్తి: కొన్నిరోజులుగా జిల్లాలో చోటు చేసుకున్న చోరీ ఘటనలు పోలీసులకు సవాలుగా మారాయి. జిల్లావ్యాప్తంగా మూడునెల్లో వందకుపైగా చోరీ కేసులు నమోదుకావటం గమనార్హం. దీంతో ఇంటికి తాళం వేసి ఎక్కడికైనా వెళ్లాలంటే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటి వరకు నమోదైన చోరీ కేసుల్లో రూ.1.64 కోట్ల విలువైన సొత్తు అపహరణకు గురికాగా.. పోలీసులు రికవరీ చేసిన సొత్తు విలువ కేవలం రూ.36.58 లక్షలేనని అధికారిక లెక్కలతో తెలుస్తోంది. నిఘా కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నిర్వహణ లేక నిరుపయోగంగా మారడంతో దొంగల కదలికను గుర్తించలేకపోతున్నారు.

తాళం వేసిన ఇళ్లు, దుకాణాలే లక్ష్యంగా..

జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు నమోదైన చోరీల్లో ఒకేమాదిరి అపహరణలు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. శివారు ప్రాంతాల్లోని ఇళ్లు తాళం వేసి ఉంటే గుల్లచేయటం ఖాయమనేలా చోరీలవుతున్నాయి. సీసీ కెమెరాలు లేని ప్రాంతాలను ఎంచుకుని పక్కాగా రెక్కీ నిర్వహించి చోరీలకు పాల్పడుతున్నట్లు ఇటీవల ఖిల్లాఘనపురం మండలం సోళీపురం గ్రామంలో వృద్ధురాలిపై కత్తితో దాడిచేసి బంగారం, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లిన ఘటనతో స్పష్టమవుతోంది.

⇨ విలువైన బంగారం, వెండి, నగదు మాత్రమే కాదు.. కాల్వల్లో మోటార్లు, ప్లాస్టిక్, ఇనుప పైపులు, రాగి, అల్యూమినియం వైర్లతో పాటు గోదాంలో ఉన్న వరి ధాన్యం బస్తాలు, ఆలయాల్లో హుండీలు, రిజర్వాయర్లలోని మోటార్లను సైతం ఎత్తుకెళ్తున్నారు. ఈ నెల 7 అర్ధరాత్రి అమరచింతలోని బీడీ ఫ్యాక్టరీ రోడ్‌లో మోటారు సైకిళ్ల చోరీకి విఫలయత్నం చేసిన దుండగులు బైక్ మెకానిక్ దుకాణంలో ప్లానర్లు, వైర్లు, ప్లగ్‌లు చోరీ చేసిన ఘటనలు పోలీసులను ఆశ్చర్యానికి గురిచేశాయి.

ఎస్‌ఐపై చిన్నన్న ఫైర్..

పోలీసుల నిర్లక్ష్యంతోనే వరుస చోరీలు జరుగుతున్నాయంటూ ఇటీవల రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి పెబ్బేరు ఎస్‌ఐపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గోదాంలో అగ్ని ప్రమాదం, మార్చి, ఏప్రిల్‌లో చోటు చేసుకున్న చోరీల్లో ఎలాంటి పురోగతి సాధించలేదు ఎందుకని ప్రశ్నించారు. పని చేయటం ఇష్టం లేకుంటే వెళ్లిపోవాలని తేల్చి చెప్పారు.

తాజాగా చోటు చేసుకున్న ఘటనలు..

ఈ నెల 8న అమరచింతలో ఓ పాల దుకాణం షట్టర్‌ను పగులగొట్టి రూ.60 వేల నగదు ఎత్తుకెళ్లారు. వరుసగా రెండురోజులు చోరీలు జరిగినా పోలీసులు నివారించలేకపోయారన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

⇨ ఈ నెల 10న అర్ధరాత్రి పెబ్బేరు బస్టాండ్ ఎదుట మున్సిపల్ కాంప్లెక్స్‌లో ఎనిమిది దుకాణాల తాళాలు పగులగొట్టి మొబైల్ షాప్‌లో సెల్‌ఫోన్లు, లేడీస్ కార్నర్‌లో రూ.45 వేల నగదు చోరీచేశారు. ఇనుప రాడ్లతో తాళాలు పగులగొట్టి షట్టర్లు పైకెత్తి చోరీకి పాల్పడినట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

⇨ ఈ నెల 11న ఖిల్లాఘనపురం మండలం సోళీపురం గ్రామంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలిపై ఇద్దరు మహిళలు కత్తితో దాడిచేసి బంగారం, వెండి ఆభరణాలు చోరీ చేశారు. గ్రామస్తులు వారిని పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.

గస్తీ పెంచుతాం..



చోరీలను కట్టడి చేసేందుకు సిబ్బందిని అప్రమత్తం చేశాం. రాత్రి వేళల్లో గస్తీ పెంచుతాం. చోరీ కేసుల్లో ఇప్పటికే కొంతమేర రికవరీ చేశాం. ఎవరైనా కొత్త వ్యక్తులు గ్రామాలు, కాలనీల్లో తిరుగుతున్నట్లు కనిపిస్తే వెంటనే డయల్ 100కుగాని పోలీసులకుగాని సమాచారం ఇవ్వాలి.

– జి.వెంకటేశ్వర్‌రావు, డీఎస్పీ, వనపర్తి

నేడు పీయూలో జాబ్‌మేళా

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో సోమవారం దివీస్ సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పీయూ ప్రిన్సిపాల్ చంద్రకిరణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, ఎంఫార్మసీ, బీ ఫార్మసీ, ఎమ్మెస్సీ 4వ సెమిస్టర్ విద్యార్థులు కూడా జాబ్‌మేళాలలో పాల్గొనవచ్చని చెప్పారు.

సుపరిపాలన కోసం కాంగ్రెస్‌కు పట్టం కట్టండి

చారకొండ/కల్వకుర్తి టౌన్: దేశంలో సుపరిపాలన కోసం కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని ఎంపీ అభ్యర్థి డా.మల్లు రవి అన్నారు. మండలంలోని జూపల్లిలో శనివారం ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డిలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో మల్లు రవి మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక పాలన సాగిస్తోందన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ప్రజలు నమ్మకంతో ఉన్నారని.. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాల్లో గెలుపొంది, అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. అనంతరం ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, కసిరెడ్డి మాట్లాడుతూ అచ్చంపేట, కల్వకుర్తి నియోజకవర్గాల అభివృద్ధికి మల్లు రవి గెలుపు అవసరమన్నారు. జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్, మండల అధ్యక్షుడు బాల్‌రాం గౌడ్, వెంకటయ్య యాదవ్, బాల్‌రాజు, సాంబయ్యగౌడ్ పాల్గొన్నారు.

బీజేపీ పాలన అవినీతిమయం

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంలో అవినీతి రాజ్యమేలుతోందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆరోపించారు. పట్టణంలోని శివాజీ చౌరస్తాలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లు రవితో కలిసి నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను అమలుచేశామని చెప్పారు. మాజీ మంత్రి చిత్తరంజన్ దాస్, పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి ఇందిరాశోభన్ పాల్గొన్నారు.

18న రౌండ్‌టేబుల్ సమావేశం

పాలమూరు: 'చిత్తనూర్ ఇథనాల్ పరిశ్రమ దుష్పరిణామాలు– రైతులపై కొనసాగుతున్న నిర్బంధం, తెలంగాణ ఇథనాల్ పరిశ్రమలు– తెలంగాణ భవిష్యత్‌పై చర్చిద్దాం' అనే అంశంపై హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన్ కేంద్రంలో ఈ నెల 18న ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కంపెనీ ప్రారంభించిన నాటి నుంచి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రౌండ్‌టేబుల్ సమావేశానికి ఉమ్మడి జిల్లా నుంచి ప్రజా సంఘాల నాయకులు, మేధావులు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర సంఘటన మంత్రి చంద్రశేఖర్

గద్వాల రూరల్: గత పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమాభివృద్ధి పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర సంఘటన మంత్రి చంద్రశేఖర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించగా.. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాని మోదీ పాలన, ప్రభుత్వ పథకాలపై ఇంటింటి, సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేసి పార్టీ గెలుపునకు అందరూ కృషి చేయాలన్నారు. అదే విధంగా ప్రతిఇంటికి కనీసం మూడు సార్లు వెళ్లి ప్రభుత్వ పథకాలు, మోదీ పాలనను వివరించి బూత్ మేనేజ్‌మెంట్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ప్రపంచంలోనే భారతదేశాన్ని విశ్వగురువుగా నిలిపేందుకు మోదీ అహర్నిషలు కృషి చేస్తున్నారని ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ 400 సీట్లకుపైగా గెలవబోతుందని, ప్రతిబూత్‌లలో కనీసం 370పైగా మెజారిటీ వచ్చేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జీ బంగారు శృతి, పార్లమెంట్ ప్రభారి అశోక్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి, సీనియర్ నాయకులు అయ్యంగారి ప్రభాకర్, అప్సర్‌పాషా, డీకే స్నిగ్ధారెడ్డి, రామాంజనేయులు, మిర్జాపురం వెంకటేశ్వర్‌రెడ్డి, బండల వెంకట్రాములు, పద్మావతి, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

గద్వాల: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం స్థానిక కార్యాలయంపై ఏర్పాటు చేసిన యూటీఎఫ్ జెండాను జిల్లా అధ్యక్షుడు తిప్పన్న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ నిరంతరం శ్రమించిదని పేర్కొన్నారు. అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు చేసిందని గుర్తుచేశారు. సామాజిక స్పృహ కలిగిన సంఘంగా కరోనా సమయంలో గతంలో పేద వర్గానికి చెందిన కార్మికుల కోసం తమ వంతుగా సేవా కార్యక్రమాలను చేపట్టామన్నారు. గత పదేళ్లుగా వివిధ యాజమాన్యాల పరిధిలోని ఉపాధ్యాయుల సంక్షేమం కోసం అనేక పోరాటాలు చేస్తున్నామన్నారు. ఈ వేసవి సెలవుల్లోనే బదిలీలు, పదోన్నతులు జరిగే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. 2010 కంటే ముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్‌తో సంబంధం లేకుండా పదోన్నతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల్, నాయకులు చక్రధర్, హుస్సేన్, రవికుమార్, జయచంద్ర కుమార్, చిరంజీవినాయుడు, ప్రకాష్, బీచుపల్లి, మోహన్‌కుమార్, సుదర్శన్, రాజేష్, శ్రీధర్, చిన్న నర్సింహులు, పరుషరాముడు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి

కొల్లాపూర్ రూరల్: విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతిచెందిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కొండాపూర్ మండలం ముక్కిడిగుండం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కుందేళ్ల బాలయ్య(65) శనివారం ఉదయం వ్యవసాయ పొలానికి వెళ్లాడు. పొలం మీదుగా పక్క పొలానికి తీసుకెళ్లిన తీగ ప్రమావశాత్తు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. కుమారుడు శివ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


ఈరన్న (ఫైల్)

గట్టు: మండల పరిధిలోని ముచ్చోనిపల్లెకి చెందిన కుర్వ మేకల ఈరన్న(41) కర్నూల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ముచ్చోనిపల్లెకి చెందిన కుర్వ మేకల ఈరన్న రెండు రోజుల కిందట ద్విచక్ర వాహనంపై వెళ్తూ.. అదుపు తప్పి, రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టాడు. గాయపడిన అతడిని హుటాహుటిన అయిజకు, అక్కడి నుంచి కర్నూల్ ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు. కర్నూల్ ఆస్పత్రిలోనే చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. అతడికి భార్య సుజాతతో పాటుగా కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ వెంకటేష్ తెలియజేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెబ్బేరు రూరల్: చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి శనివారం మృతిచెందినట్లు వనపర్తి రూరల్ ఎస్ఐ జలంధర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. పాన్‌గల్ మండలం చింతకుంటకు చెందిన చిక్కండ్ల రమేష్(35) వనపర్తిలోని మర్రికుంటలో ప్రథమ చికిత్స కేంద్రం నిర్వర్తిస్తూ జీవనం సాగించేవాడు. ఈ నెల 1న పని ముగించుకొని రాత్రి 8 గంటల సమయంలో బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యం వనపర్తి మండలం దత్తాయిపల్లి సమీపంలో అడవిపందిని ఢీకొనడంతో కింద పడి తలకు బలమైన గాయమైంది. వెంటనే చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. భార్య కురువ నర్మద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ఉండవెల్లి: మండలంలోని బొంకూరులో గుర్తు తెలియని మృతదేహం నీటిగుంతలో లభించినట్లు ఎస్ఐ శ్రీనివాసులు శనివారం తెలిపారు. బొంకూరులోని నీటి గుంతలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని అలంపూర్ ఆస్పత్రికి తరలించారు. మృతి చెందిన వ్యక్తి ఒంటిపై షర్ట్, నీలం రంగు ప్యాంట్ ఉందని, అతని వయస్సు 40కి పైగా ఉంటుందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఈతకు వెళ్లిన యువకుడు గల్లంతు


లక్ష్మణ్‌నాయక్ (ఫైల్)

బిజినేపల్లి: మండలంలోని బోరుసుగడ్డ గ్రామపంచాయతీ ఇప్పలతండాకు చెందిన కేతావత్ లక్ష్మణ్ నాయక్(18) శనివారం మధ్యాహ్నం ఈతకు వెళ్లి గల్లంతయ్యాడు. స్థానికుల కథనం మేరకు.. లక్ష్మణ్ నాయక్ తోటి స్నేహితులతో కలిసి వట్టెం జలాశయం వద్ద గుంతలో ఈతకు వెళ్లాడు. ఈత కొడుతున్న క్రమంలో ఒక్కసారిగా నీటిలో మునిగిపోయాడు. స్నేహితులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టినా రాత్రి వరకు లభించలేదు.

సోనామసూరి క్వింటా రూ.2,563



దేవరకద్ర: పట్టణంలోని మార్కెట్ యార్డులో ఆరు రోజుల తర్వాత శనివారం లావాదేవీలు జరిగాయి. మార్కెట్‌కు పండుగలతో వివిధ రకాల సెలవుల వల్ల మొత్తం ఆరు రోజులు సెలవులు రావడంతో మార్కెట్‌లో లావాదేవీలు కొనసాగలేదు. ఈ వారం శనివారం మొదటి రోజు మార్కెట్ ప్రారంభం కావడంతో రైతులు పెద్ద ఎత్తున ధాన్యాన్ని అమ్మకానికి తెచ్చారు. మార్కెట్‌కు దాదాపు 12 వేల బస్తాల ధాన్యం అమ్మకానికి రావడంతో మార్కెట్ యార్డు అంతా ధాన్యం రాసులతో నిండిపోయింది.

మద్దతు ధర కంటే ఎక్కువే..

దేవరకద్ర మార్కెట్‌లో సోనామసూరి ధాన్యం క్వింటాల్‌కు మద్దతు ధర కంటే ఎక్కువ పలికింది. మద్దతు ధర రూ.2,203 ఉండగా.. మార్కెట్‌లో గరిష్టంగా రూ.2,563, కనిష్టంగా రూ.1,909 లభించింది. కందులు సరాసరిగా రూ.10,519 ధర వచ్చింది.

గంప జాతర


గంపల్లో వంట పాత్రలు, సామగ్రితో పొలాల్లోని చెట్ల కిందకు వెళ్తున్న హన్వాడ మండలం షేక్‌పల్లి మహిళలు (ఫైల్)

బయలెల్లుతున్న గ్రామాలు

- ఇళ్లకు తాళాలు.. రోజంతా వనవాసాలు
- ఏటా ఆచారంగా వస్తున్న ప్రత్యేక పండుగ
- వర్షాలు సమృద్ధిగా కురవాలని.. అంటురోగాలు, దరిద్రం పోతుందనే నమ్మకం

వర్షాలు సమృద్ధిగా కురవాలని.. పంటలు బాగా పండాలని.. గ్రామంలో అనుకోని విపత్కర సంఘటనలు.. అశుభాలు జరగకుండా.. అంటురోగాలు ప్రబలకుండా ఏడాదికోసారి నిర్వహించేదే గంపజాతర. ప్రతీ ఏటా ఫిబ్రవరి ప్రారంభం నుంచి మే నెల వరకు ప్రతీ ఆదివారం, మంగళవారాల్లో ఏదో ఒకరోజు ఈ గంపజాతరను నిర్వహిస్తారు. ఉదయాన్నే లేచి వంట పాత్రలు, వంటకు కావాల్సిన సరుకులు తీసుకొని ఒక గంపలో పెట్టుకొని ఇళ్లకు తాళాలేసి గ్రామాన్ని వదిలిపెడతారు గ్రామ ప్రజలు. గంపను నెత్తిపై పెట్టుకొని ఊరు చివర, పంట పొలాల వద్ద చెట్ల కింద వంటలు చేసుకొని పిల్లా పాపలతో గడుపుతారు. జిల్లాలోని చాలా గ్రామాల్లో ఈ గంపజాతరను నిర్వహిస్తారు.

మహబూబ్‌నగర్ న్యూటౌన్: గంప జాతర పేరుతో ఊరు వదిలే ఆచారం ప్రతీ సంవత్సరం జిల్లాలోని చాలా గ్రామాల్లో కొనసాగుతూ వస్తోంది. ఈ కార్యక్రమాన్ని తాజాగా మహబూబ్‌నగర్, దేవరకద్ర, జడ్చర్ల నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో జరుపుకొంటున్నారు. ప్రజల క్షేమం మేరకు గంపజాతర నిర్వహిస్తారు. గ్రామస్తులంతా కలిసి ఒక తేదీని నిర్ణయించి ఆ రోజు మూకుమ్మడిగా ఊరును వదిలి పెట్టేందుకు గ్రామపెద్దల సమక్షంలో తీర్మానిస్తారు. ఆ రోజు గ్రామంలో ఎవరూ ఉండకుండా ఇళ్లకు తాళాలు వేసి పంట పొలాల్లోని చెట్ల నీడ ఉన్న ప్రాంతాలకు వెళతారు. గ్రామంలో ఎవరికైనా అమ్మతల్లి లాంటివి చిన్న పిల్లలకు వస్తే గంపజాతర నిర్వహించరు. ప్రతీసారి మాదిరిగానే ఈ సంవత్సరం సైతం గత ఫిబ్రవరి నెల నుంచి ఆది, మంగళవారాల్లో అయా గ్రామాల ప్రజలు గంపజాతరను నిర్వహిస్తున్నారు. కుటుంబ సమేతంగా గ్రామానికి దూరంగా పంట పొలాలు, వారికి అనుకూలమైన చోట చెట్ల కిందకు వెళ్లి గడుపుతున్నారు. వంటపాత్రల్లో వండుకొని అక్కడే ఆరగించి పొద్దస్తమానం గడుపుతున్నారు. సాయంత్రం కాగానే వంట పాత్రలు, తెచ్చుకున్న ప్లేట్లు, ఇతరత్రా వాటిని శుభ్రం చేసుకొని ఇళ్లకు చేరుకుంటారు.

అంటు రోగాలు ప్రబలవని నమ్మకం

ఏటా గంప జాతర పేరుతో గ్రామాన్ని వదిలి చెట్ల కింద గడిపి పొద్దుపోయాక ఇళ్లకు చేరుకుంటే అంటురోగాలు, దరిద్రం వదలడమే కాకుండా దరి చేరవని ప్రజల నమ్మకం. గంప జాతర కార్యక్రమాన్ని ఇప్పటికీ చాలా గ్రామాల్లో ప్రతీ సంవత్సరం నిర్వహించడం ఆచారంగా వస్తోంది. ముందుగా నిర్ణయించిన ప్రకారం ఆ రోజు గ్రామంలో ఎవరూ ఉండకుండా ఇళ్లకు తాళాలేసి వెళ్తారు. ఆ రోజు ఇంటి ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించరాదని చెప్తారు.

గతంలో వర్షాల కోసం గంపజాతర

గత మూడు నాలుగు దశాబ్దాల క్రితం వరకు గంప జాతరను అన్ని గ్రామాల్లో జరుపుకొనేవారని పెద్దలు చెబుతారు. వర్షాలు కురవాలని కోరుతూ గ్రామాల్లో గంపజాతర నిర్వహించేవారని వారు పేర్కొంటున్నారు. ఉదయం తెల్లవారకముందే లేచి ఇళ్లకు తాళాలేసి గ్రామాన్ని వదిలేవారని, కాకపోతే చెట్లకిందకు కాకుండా అడవిలోకి వెళ్లి ప్రకృతిని పూజించే వారని పేర్కొంటున్నారు. గట్టిగా ఏడ్వటం, బాధ పడటం వంటివి చేసేవారని, తినడానికి మంచి ఆహారం కాకుండా చింతపండు, ఉప్పు, కారం వంటివి తీసుకెళ్లేవారని చెబుతున్నారు. రోజంతా అడవిలో బాధపడి వర్షాలు కురవాలని ప్రకృతిని పూజించి సాయంత్రం ఇళ్లకు చేరుకునే వారని చెబుతున్నారు.

ఆచారంగా వస్తోంది



గంపజాతర కార్యక్రమం ప్రతీ సంవత్సరం ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఒక రోజు నిర్వహించడం ఆచారంగా వస్తోంది. ఇలా చేస్తే పలు వ్యాధులు దరిచేరవనే నమ్మకం అందరిలో ఉంది. అంతేకాకుండా చెట్టకింద భోజనాలు చేసి ఉత్సాహంగా కాలక్షేపం చేసేందుకు ప్రజలు దీన్ని నిర్వహిస్తున్నారు.

– మేకల శివ, పెద్దదర్పల్లి గ్రామం

సంతోషంగా ఉండాలనే..



వర్షాలు కురువక ముందే గంపజాతరను ప్రతీ సంవత్సరం ఆచారంగా నిర్వహిస్తాం. మా గ్రామంలో ఈ నెల 17వ తేదీన జరుపుకున్నాం. అంటురోగాలు రావద్దని, గ్రామంలో వనదేవతలు విహరించి అభివృద్ధి జరగాలని గంపజాతరను నిర్వహించడం జరుగుతుంది.

– శ్రీదేవి, షేక్‌పల్లి మాజీ సర్పంచ్, హన్వాడ మండలం

ఇది అందరి నిర్ణయం..



గ్రామంలో గంపజాతర వెళ్లకుంటే ఏదో కోల్పోయినట్లు ఉంటది. ఎప్పుడూ అలాంటి పరిస్థితి రావొద్దని నేను కోరుకుంటా. గ్రామంలో అందరూ బాగుండాలని, అందరికి మంచి జరుగాలనే ఉద్దేశంతో ఈ గంపజాతరను ప్రతీ సంవత్సరం గ్రామంలో అందరి నిర్ణయం మేరకు ఓ రోజు నిర్వహిస్తాం. మా గ్రామంలో ఇటీవల నిర్వహించాం.

– కిందింటి కిరణ్, హన్వాడ మండల కేంద్రం

క్రమంగా ఆచారంలో మార్పులు

గత మూడు నాలుగు దశాబ్దాల క్రితం ఉన్న గంపజాతర నిర్వహణ ఆచారాల్లో మానవ అభివృద్ధి క్రమంలో మార్పులు చోటు చేసుకున్నట్లు పెద్దలు చెబుతున్నారు. ఇళ్లను వదిలి గ్రామాన్ని దాటి అడవిలో కాకుండా పొలాల్లో చెట్ల కింద గడపడం, ఆహారపు ఆచారంలోనూ ఎవరికి నచ్చిన విధంగా వారు మార్పులు తెచ్చారని అంటున్నారు. గంపజాతర నిర్వహించిన తర్వాతనే పొలం పనులను మొదలు పెడతారు. వర్షాలు కురువకముందే గంపజాతరను జరుపుకొంటారు. వర్షాలు రాగానే పంటలు వేసుకునేందుకు పొలాలను సిద్ధంగా ఉంచుతారు.


చిన్నదర్పల్లిలో చెట్లకింద వంటలు చేసుకొని సరదాగా గడుపుతున్న కుటుంబం


వంటలు వండుతున్న షేక్‌పల్లికి చెందిన కుటుంబం

తనిఖీల్లో నగదు పట్టివేత


మరికల్‌లో పట్టుబడ్డ నగదు


ఎక్లాస్‌పూర్ చెక్‌పోస్టులో నగదు స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు


ఎడమ పాతాళగంగ వద్ద పట్టుబడిన మద్యంతో పోలీసులు, నిందితుడు

అలంపూర్: రాష్ట్ర సరిహద్దులో వాహన తనిఖీలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. పత్రాలు లేకుండా ఉన్న నగదును పోలీసులు పట్టుకుని సీజ్ చేస్తున్నారు. అలంపూర్‌చౌరస్తా సమీపంలోని 44వ జాతీయరహదారిపై ఉన్న పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. కర్నూల్‌కు చెందిన శశికాంత్ రెడ్డి గ్యాస్ ఏజెన్సీకి సంబంధించిన డబ్బులు వసూలు చేసుకుని టోల్‌ప్లాజా వద్ద యూటర్న్ తీసుకుంటుండగా పోలీసులు వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. అతని వద్ద పత్రాలు లేని రూ.2,12,430 లభించడంతో సీజ్ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా కర్నూల్‌కు చెందిన షేక్ అస్లాం బాషా మెడికల్ ఏజెన్సీ డబ్బులు వసూలు చేసుకుని అయిజ నుంచి కర్నూల్ వెళ్తుండగా టోల్‌ప్లాజా వద్ద తనిఖీ నిర్వహించగా పత్రాలు లేకుండా రూ.63,100 ఉండటంతో నగదు స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు ఉండవెల్లి ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

మరికల్: మండలంలోని లాల్‌కోట చెక్‌పోస్ట్ వద్ద శనివారం పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా నగదు పట్టుకున్నారు. రాయచూర్ నుంచి హైదరాబాద్‌కు కారులో వెళ్తున్న ఉమర్, సయ్యద్‌అహ్మద్ వద్ద రూ. 1.90 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మురళీ తెలిపారు.

రూ.3.80 లక్షలు పట్టివేత

నారాయణపేట రూరల్: మండలంలోని సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిర్వహించిన తనిఖీల్లో రూ.3.84లక్షలను పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు. కర్ణాటక రాష్ట్రం యాద్గీర్‌కు చెందిన వాకిటి వెంకటప్ప రూ.92వేలు, ఉజ్జెలికి చెందిన రాజు రూ.1.50లక్షలు పట్టుకున్నారు. అదేవిధంగా ఎక్లాస్‌పూర్ చెక్‌పోస్టులో కేసరి గ్రామానికి చెందిన హన్మంతు నుంచి రూ.1.42లక్షలను పట్టుకున్నట్లు తెలిపారు. తనిఖీల్లో హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు, కానిస్టేబుల్ మురళీకృష్ణ, ఎక్సైజ్ కానిస్టేబుల్ సయ్యద్‌బాషా పాల్గొన్నారు.

మద్యం పట్టివేత: ఆరుగురిపై కేసులు నమోదు

దోమలపెంట: నాగర్‌కర్నూల్ జిల్లా, అమ్రాబాద్ మండల పరిధిలోని దోమలపెంట, ఈగలపెంట, ఎడమ పాతాళగంగ ప్రాంతాల్లో తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు చెందిన ఎక్సైజ్ అధికారులు శనివారం సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ, అచ్చంపేట కార్యాలయం వారు ఒక ప్రకటనలో తెలిపారు. తనిఖీల్లో 33.7 లీటర్ల మద్యం, 52 లీటర్ల బీరును సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. దోమలపెంట, ఈగలపెంటలో అక్రమంగా కల్లు విక్రయిస్తున్న ఇద్దరిపై, సారా అమ్ముతున్న మహిళ వద్ద నుంచి అయిదు లీటర్ల సారా సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. మద్యం విక్రయిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్, మహబూబ్‌నగర్, డీటీఎఫ్, నాగర్‌కర్నూల్, ఎస్‌హెచ్‌ఓ, అచ్చంపేట, ఏపీ రాష్ట్రానికి చెందిన ఎన్‌ఫోర్స్‌మెంట్, నంద్యాల, డీటీఎఫ్, నంద్యాల, ఎస్‌హెచ్‌ఓ ఆత్మకూర్ అధికారులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

పర్యాటక అతిథి గృహంలో అగ్ని ప్రమాదం


గదిలో కాలిపోయిన మంచం

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ పట్టణంలోని టూరిజం అతిథి గృహంలో శుక్రవారం ఉదయం అగ్ని ప్రమాదం చోటు చేసుకుని ఒక గది కాలిపోయింది. అయితే ఈ ఘటన బయటకు పొక్కనివ్వకుండా నిర్వాహకులు ప్రయత్నించినప్పటికి, 24 గంటల తర్వాత విషయం కాస్తా బయటకు తెలిసింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ కుకట్‌పల్లికి చెందిన కుటుంబసభ్యులు శుక్రవారం రూం నంబర్ 114 తీసుకున్నారు. రూంలో మొబైల్ చార్జింగ్ పెట్టి చండీహోమంలో పాల్గొనేందుకు జోగుళాంబ ఆలయానికి వెళ్లారు. కాసేపటి తర్వాత గదిలో నుంచి కాలిన వాసన, పొగలు రావటం గమనించిన టూరిజం సిబ్బంది రాము, నాగేష్ మేనేజర్ విక్రమ్‌కు సమాచారం అందించారు. తీరా గదిలో మంచం, ఏసీ, టీవీ, ఫర్నీచర్ బాగా కలిపోయాయి. సుమారు రూ.2లక్షల దాక ఆస్తి నష్టం వాటిల్లినట్లు భావిస్తున్నారు. శనివారం పర్యాటక శాఖ జీఎం నథన్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అడుగడుగున నిర్లక్ష్యం–పర్యావేక్షణ లేని యంత్రాంగం

విచారణ చేయిస్తాం

భక్తులు గదికి తాళం వేసుకుని ఆలయానికి వెళ్లారు. సెల్‌ఫోన్ బెడ్‌పై పెట్టినట్టు ఉన్నారు. అది హీట్ అయ్యి ప్రమాదానికి దారి తీసింది. మొబైల్ కూడా ఇంకా అక్కడే ఉంది. వైరింగ్ ప్రాబ్లం లేదు. షార్ట్‌సర్క్యూట్ ఐతే ఎంసీబీలు పడిపోతాయి. ఘటనపై విచారణ చేయిస్తాం.

– నథన్, టూరిజం జీఎం

జంతువుల సంరక్షణ అందరి బాధ్యత


భీమ్యాతండా వాసులకు అవగాహన కల్పిస్తున్న ఫారెస్ట్ అధికారులు

బిజినేపల్లి: అటవీ జంతువుల సంరక్షణ అందరి బాధ్యత అని.. ఎట్టి పరిస్థితుల్లో క్రూరమృగాలు, చిరుతలకు ఎవరైనా హాని తలపెడితే కఠిన చర్యలు ఉంటాయని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పర్వేజ్ అహ్మద్ అన్నారు. శనివారం గంగారం ఫారెస్ట్ సమీపంలోని భీమ్యాతండాలో చిరుత సంచారం, దాని జీవనశైలి, అటవీ సంరక్షణపై తండావాసులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఘనపూర్ అటవీ ప్రాంతంలో ఆహార కొరత వలన చిరుతలు గంగారం అడవికి వచ్చాయని, ఇక్కడ జింకలు, నెమళ్లు, అడవి పందులు ఇతరాత్ర జీవజాతులు సమృద్ధిగా ఉన్నాయన్నారు. పశువులను మేత కోసం అడవిలోకి తీసుకెళ్తే దాడి చేసే అవకాశాలున్నాయని, వెళ్లవద్దని సూచించారు. చిరుతలు ఉండటం వలన వేటగాళ్లు పారిపోతారని, చెట్లను నరికే వారు కూడా తగ్గుతారని వివరించారు. తద్వారా అడవి పచ్చదనం పరుచుకొని జింకలు, నెమళ్లు, దుప్పులు, అడవి పందులు సంరక్షించబడతాయన్నారు. చిరుతలు ఉండటం వలన చెట్లు పెరిగి వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, వన్య ప్రాణుల వలన పంట నష్టం కూడా తగ్గుతుందని వివరించారు. క్రూరమృగాలు, చిరుతలకు ఏమైన హాని తలపెడితే కఠిన చర్యలు ఉంటాయని, అలాంటి పనులు చేయరాదని వివరించారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు మోహన్, ప్రవీణ, రవి కాంత్, బాలస్వామి, ఖాజా పాల్గొన్నారు.

జూపార్క్‌కు ఎలుగుబంటి పిల్ల తరలింపు


అటవీశాఖ వాచర్ వద్ద ఎలుగుబంటి పిల్ల

మన్ననూర్: తల్లి నుంచి తప్పిపోయిన ఎలుగుబంటి పిల్లను అటవీశాఖ అధికారులు జూపార్క్‌కు తరలించారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ఐదు రోజుల కిందట అటవీ సిబ్బంది విధుల్లో భాగంగా పాతూర్‌బైలు బైస్ క్యాంపు పరిధిలోని తాటిగుండాల, తాల్లచెలుక అటవీ ప్రాంతంలో సంచరిస్తున్నారు. ఈ క్రమంలో ఎలుగుబంటి పిల్ల ఒకటి వారికి కనిపించింది. దీంతో సిబ్బంది తగు రక్షణ తీసుకుంటూ ఆ ప్రాంతంలో తల్లి ఎలుగుబంటి ఉంది, లేనిది గమనించారు. ఎంతకూ తల్లి ఎలుగుబంటి కనిపించలేదు. దీంతో సిబ్బంది పిల్లఎలుగుబంటిని పరిశీలించగా.. సుమారు 20 నుంచి 25 రోజుల వయస్సు కలిగి, కొంత అస్వస్థతగా గుర్తైనట్లు కనిపించింది. దీంతో ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారుల సూచన మేరకు పిల్ల ఎలుగుబంటిపి వటువర్లపల్లి బేస్ క్యాంపునకు తీసుకొచ్చారు. అనంతరం చికిత్స నిమిత్తం హైదరాబాద్ జూపార్క్‌కు తరలించామని అధికారులు తెలియజేశారు.

చెర్కూర్‌లో 9 ఇళ్లలో చోరీ


చోరీ జరిగిన ఇంట్లో తెరిచి ఉన్న బీరువా

వెల్దండ: మండలంలోని చెర్కూర్‌లో శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు వేసిన 9 ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. గ్రామస్తులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన దొడ్ల అల్లాజీ కుటుంబం శుక్రవారం రాత్రి భోజనం చేసి 9 గంటల ప్రాంతంలో ఇంటిపై నిద్రకు ఉపక్రమించారు. శనివారం తెల్లవారుజామున 5.30 గంటలకు నిద్రలేచి కిందకి వచ్చి చూస్తే ఇంటి తాళం విరిగి కనిపించింది. లోనికి వెళ్లి చూడగా బీరువాలోని రూ.25 వేల నగదు లేకపోవడంతో చోరీ జరిగినట్లు నిర్ధారణకు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా అల్లె మహేష్, మంగలి బుచ్చయ్య, నరేంద్రచారి, ధ్యాపం దశరథరెడ్డి, బుర్రా రమేష్, గోలి సావిత్రమ్మ ఇళ్లలోనూ చోరీ జరిగి కొంత నగదు, బంగారు ఎత్తికెళ్లినట్లు పోలీసులకు ఫిర్యాదులు అందాయి. సాకలి దేవయ్య, సాకలి జంగయ్య హైదరాబాద్‌లో నివసిస్తుండగా.. వారి ఇళ్ల తాళాలు ధ్వంసం చేశారు. జిల్లాకేంద్రం నుంచి క్లూస్ టీమ్‌ను పిలిపించి ఆధారాలు సేకరించారు.

పోలీసుల విచారణ..

సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఐ రవి శనివారం చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఇంటిపై నిద్రించే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు అవగాహన కల్పించారు.

రామన్‌పాడులో 1,011 అడుగులు

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో నీటిమట్టం తగ్గుతోంది. శనివారం 1,011 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలియజేశారు.

మద్యానికి భార్య డబ్బులు ఇవ్వలేదని..

ఉరేసుకుని భర్త ఆత్మహత్య


వెంకటేష్ (ఫైల్)

కొత్తకోట రూరల్: మద్యం తాగేందుకు భార్య డబ్బులు ఇవ్వలేదని భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పాన్‌గల్ మండలం రేమొద్దులకు చెందిన తుల్చ వెంకటేష్(45) భార్య తుల్చ లక్ష్మి, ఇద్దరు పిల్లలతో కలిసి కొంతకాలంగా కొత్తకోటలోని దండుగడ్డవీధిలో ఉంటూ మేస్త్రీపనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. రేమొద్దులలో తన వ్యవసాయ పొలాన్ని ఇటీవల విక్రయించగా వచ్చిన డబ్బులతో పనికి వెళ్లకుండా తాగుడుకు బానిసయ్యాడు. ఇదే క్రమంలో శుక్రవారం రాత్రి మద్యం తాగేందుకు భార్యను డబ్బులు ఇవ్వాలని అడుగగా.. అందుకు ఆమె నిరాకరించడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో లక్ష్మి పిల్లలతో కలిసి ఇంటి పక్కనే ఉన్న తల్లిదండ్రుల ఇంటి వద్దకు వెళ్లి అక్కడే పడుకుంది. శనివారం ఉదయం ఇంటి తలుపులు తెరుచుకోకపోవడంతో తలుపులు గడియపెట్టి ఉండటంతో ఆందోళనకు చెందిన వారు గడియను తీసి చూడగా కాంపౌండ్‌లో గల చెట్టుకు ఉరివేసుకుని కనిపించాడు. మద్యానికి డబ్బులు అడిగాడని, ఇవ్వకపోవడంతో తాగిన మైకంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బావిలో పడి వివాహిత ఆత్మహత్య


పార్వతమ్మ (ఫైల్)

తెలకపల్లి: బావిలో పడి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలిలా.. మండలంలోని పెద్దూరు గ్రామానికి చెందిన పార్వతమ్మ(28) శనివారం సాయంత్రం ఆ గ్రామ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని పాత బావిలో పడి ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, పోలీసులు బావిలోనుంచి మృతదేహాన్ని బయటకు తీసి నాగర్‌కర్నూల్ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు హెడ్‌కానిస్టేబుల్ పరుశరాములు తెలిపారు. ఆమె మృతిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని, ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు. మృతురాలికి భర్త చెన్నయ్య ఉన్నాడు.

ఆడియో హల్‌చల్

నవాబుపేట: మండలంలో ఇసుక అక్రమార్కులు, పోలీసుల మధ్య జరిగిన సంభాషణ ఆడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేసే పోలీసులే వారికి మద్దతుగా మాట్లాడిన మాటలు బయటకు రావడంతో అందరూ అవాక్కయ్యారు. ఇసుక రవాణా జరుగుతుందని పోలీసులకు సమాచారం రావటం.. వారు అక్కడికి చేరుకునే లోగా ట్రాక్టర్లు, టిప్పర్లు వెళ్లిపోవడం పలుమార్లు జరిగింది. కాగా పోలీసులే వారికి ముందస్తు సమాచారం ఇవ్వటంతో అక్రమ రవాణా ఎలాంటి ఆటంకాలు లేకుండా సాగుతుందని మండల ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.